# ఈనాడు సినిమా



అలీ అనగానే ప్రేక్షకుల మొహాల్లో చిరునవ్వు ప్రత్యక్షమవుతుంది. సినిమాల్లోనే కాకుండా... బుల్లితెర పైనా తనదైన శైలిలో అల్లరి చేస్తూ వినోదాన్ని పండిస్తుంటారు. బుల్లితెర షోలతో ఇప్పటికే ఇంటింటికీ చేరువైన ఆయన ప్రస్తుతం 'అలీతో సరదాగా' అంటూ సందడి చేస్తున్నారు. ప్రతి సోమవారం రాత్రి ఈటీవీలో 9.30 గంటలకి ఈ కార్యక్రమం ప్రసారమవుతోంది. నవ్వుతూ, నవ్విస్తూ... తారలతో కలిసి వాళ్ల జీవితాల వెనక ఆసక్తికరమైన విషయాల్ని ఆవిష్కరిస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంటారు. సమంత అతిథిగా, ఈ రోజు ఈటీవీలో ప్రసారమవుతున్న షోతో 'అలీతో సరదాగా' వంద ఎపిసోడ్‌ల ప్రయాణాన్ని పూర్తి చేసుకొంటుంది. ఈ సందర్భంగా అలీతో 'ఈనాడు సినిమా' ప్రత్యేకంగా ముచ్చటించింది. ఆ విషయాలివీ...

## సరదాగా సెంచరీలు కొట్టేస్తున్నా!

❑ 'అలీతో సరదాగా'తో సెంచరీ కొట్టేశారు...

సెంచరీలు నాకు కొత్తేం కాదు. మొన్ననే 1978 నుంచి 2018 వరకు చేసిన సినిమాలన్నింటినీ లెక్కబెట్టా. 1100పైనే తేలాయి. ఇప్పుడు బుల్లితెరపైనా సెంచరీలు కొట్టేస్తున్నానన్నమాట (నవ్వుతూ). 'అలీ 360' నాలుగేళ్లు నడిచింది. 'అలీతో జాలీగా' 2 ఏళ్లు సాగింది. 'అలీతో సరదాగా' మొదలై కూడా రెండేళ్లయింది.

❑ ఇదివరకు బులితెర వ్యాఖ్యాతగా పలు కార్యక్రమాల్ని నిర్వహించారు. వాటితో పోలిస్తే... 'అలీతో సరదాగా' ఎలాంటి అనుభవాన్నిచ్చింది?

ఇదివరకు చేసిన కార్యక్రమాలతో పోలిస్తే ఇది చాలా వైవిధ్యం. ఒకప్పుడు అలీ షో అంటే జోకులు, డ్యాన్సులు, గెటప్పులు అంటూ సందడిగా సాగిపోయేవి. 'అలీతో సరదాగా' ప్రత్యేకం. తారల జీవితాల్ని నేరుగా ప్రేక్షకులు తెలుసుకొంటున్నారు. వాళ్లతో పాటు కొన్ని కొత్త విషయాలు నాకూ తెలుస్తుంటాయి. వీళ్ల నేపథ్యం ఇదా? ఇంత కష్టపడి వచ్చారా? అని తారల ఎదుగుదల గురించి ప్రేక్షకులు తెలుసుకొని స్ఫూర్తి పొందుతుంటారు. చాలా మంది అగ్ర నటులు, పెద్దవాళ్లు కూడా 'మేం సోమవారం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తుంటాం. ఫలానా వాళ్లని ఆ రోజు నువ్వు అడిగిన విషయం మాక్కూడా తెలియదు. నిజంగా అది చాలా ఆసక్తికరమైన విషయం' అంటూ కొన్ని ఎపిసోడ్స్‌ని గుర్తు చేస్తుంటారు. బాగా చేశావని మెచ్చుకొంటుంటారు. అలాంటి మాటలు గొప్ప తృప్తినిస్తుంటాయి. వందకిపైగా నటులు, సాంకేతిక నిపుణులతో కలిసి సరదాగా మాట్లాడుతూ... వాళ్లు ఆస్వాదించిన జీవితాల్ని, బాధపడిన క్షణాల్ని తెలుసుకొంటూ, ప్రేక్షకులకు తెలియజేస్తూ సాగిపోయిన ఓ గొప్ప కార్యక్రమం ఇది. ఈ షోని చూస్తున్న చాలా మంది 'వాళ్లని తీసుకొచ్చి మాట్లాడించండి, ఫలానావాళ్లు మీ షోకి వస్తే బాగుంటుంది' అని సలహా ఇస్తుంటారు. దీన్నిబట్టి 'అలీతో సరదాగా' ఎంత ఆదరణని సంపాదించిందో అర్థమవుతుంది.

❑ చాలామంది వ్యక్తిగత జీవితాల్లో జరిగిన విషయాల్ని అంత సులభంగా బయటికి చెప్పుకోవడానికి ఇష్టపడరు. కానీ మీ షోలో చాలామంది ఆసక్తికరమైన విషయాలు చెబుతుంటారు. వ్యాఖ్యాతగా ఈ షో కోసం ఎలా సన్నద్ధమవుతుంటారు?

నా ఎదుగుదలంతా చిత్ర పరిశ్రమలోనే. మద్రాసులో ఉన్నప్పట్నుంచీ నాకు అందరితో అనుబంధం ఉంది. అప్పట్లో ఇంత మీడియా లేదు. ఇలా జరిగిందట, అలా జరిగిందట అని మాట్లాడుకొనేవాళ్లు. అవన్నీ ఇప్పుడు గుర్తు చేస్తుంటే, 'నీకు భలే గుర్తుందే' అంటూ ఆ రోజుల్లోకి వెళ్లిపోయి, అసలు విషయాలు చెబుతుంటారు తారలు. ఈ షో ముఖ్య ఉద్దేశమే అది. వంద ఎపిసోడ్‌ల ప్రయాణంలో 'ఈటీవీ' యాజమాన్యం, దర్శకనిర్మాతలు అనిల్ కడియాల, ప్రవీణ కడియాల, సాంకేతికబృందం కృషి ఎంతో ఉంది. అందుకే ఈ షో ఇంత విజయవంతంగా కొనసాగుతోంది.

❑ నటుడిగా తీరిక లేకుండా గడుపుతుంటారు. మరి బుల్లితెరతో ఎలా అనుబంధం ఏర్పడింది?

నాకు మొదట్నుంచీ టెలివిజన్‌పై ప్రత్యేకమైన దృష్టి ఉంది. ఏ విషయాన్నయినా, ఎవరినైనా ఇంటింటికీ చేరువ చేసే శక్తిసామర్థ్యాలు టెలివిజన్‌కి ఉన్నాయి. నిజానికి టెలివిజన్‌తో ప్రయాణం మొదలయ్యాకే నటుడిగా వంద శాతం పేరు తెచ్చుకొన్న తృప్తి కలిగింది. ఒక పక్క నటుడిగా కొనసాగుతూనే, నెలకి మూడు రోజులపాటు టెలివిజన్‌కి కేటాయిస్తున్నా.

❑ వందో ఎపిసోడ్‌కి సమంతనే అతిథిగా తీసుకు రావడానికి కారణం?

తొలి ఎపిసోడ్‌కి శక్తిమంతమైన మహిళ మంచు లక్ష్మిని తీసుకొచ్చాం. వందో ఎపిసోడ్‌కి కూడా అలాంటి వ్యక్తి ఉంటే బాగుంటుందని భావించాం. సమంత ఎంత మంచి కథానాయికో, అంత మంచి మనసున్న వ్యక్తి. పదిమందికి సాయం చేసే గుణం ఆమెది. పెళ్లికి ముందు చూశాను, తర్వాతా కలిసి పనిచేశాను. అక్కినేని కుటుంబం నుంచి వచ్చానని, ఇంత పెద్ద కథానాయికననే గర్వం ఆమెలో ఎక్కడా కనిపించదు. సమంతతో వందో ఎపిసోడ్ సరదాగా సాగిపోయింది. ఆమెతో కలిసి సెట్‌లో గడిపిన రోజులే గుర్తుకొచ్చాయి.



"అలీతో కలిసి చాలా సినిమాల్లో నటించా. ఆయన సెట్‌లో ఉన్నారంటే నవ్వులే నవ్వులు. పని చేస్తున్నట్టే ఉండదు. ఇప్పుడు వ్యాఖ్యాతగా అదే తరహాలో నవ్వించారు. ఎపిసోడ్ సరదా సరదాగా సాగిపోయింది. 'అలీతో సరదాగా' కార్యక్రమాన్ని నా స్టాఫ్ చూస్తుంటారు. వాళ్లు బాగా ఇష్టపడుతుంటారు. అప్పుడప్పుడు యూట్యూబ్‌లో నాక్కూడా చూపిస్తుంటారు. వందో ఎపిసోడ్‌కి నేను రావడం ఆనందంగా ఉంది. గతంలో నటించిన నా చిత్రాల్ని గుర్తు చేసుకోవడం... కెరీర్‌తో పాటు, వ్యక్తిగత విషయాల్ని ప్రేక్షకులతో పంచుకోవడం మంచి అనుభవం". – సమంత



ప్రగ్యా జైస్వాల్



బాలకృష్ణకు పురస్కారం అందిస్తున్న శరత్‌కుమార్, రాధిక

## బాహుబలికి పురస్కారాల పంట

● ఉత్తమ నటులు ప్రభాస్, బాలకృష్ణ ● ఉత్తమ దర్శకుడు రాజమౌళి

● దుబాయ్‌లో సందడిగా సైమా వేడుక

సైమా (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) - 2018 వేడుకలో 'బాహుబలి: ది కన్‌క్లూజన్'కి పురస్కారాల పంట పండింది. ఉత్తమ చిత్రంతో పాటు, ఉత్తమ నటుడు (ప్రభాస్), ఉత్తమ దర్శకుడు (రాజమౌళి), ఉత్తమ ప్రతినాయకుడు (రానా), ఉత్తమ సంగీత దర్శకుడు (ఎం.ఎం.కీరవాణి), ఉత్తమ ఛాయాగ్రాహకుడు (సెంథిల్ కుమార్), ఉత్తమ నేపథ్య గాయకుడు (కాలభైరవ) పురస్కారాలు వరించాయి. దుబాయ్‌లో రెండు రోజులపాటు అద్యంతం అట్టహాసంగా సాగిందీ వేడుక. రెండో రోజు తెలుగు, కన్నడ పరిశ్రమలకి పురస్కారాల్ని అందజేశారు. ఉత్తమ నటుడు పురస్కారాన్ని ప్రభాస్ తరపున కథానాయకుడు రానా అందుకొన్నారు. 'బాహుబలి: ది కన్‌క్లూజన్'లో నటనకిగానూ ఉత్తమ ప్రతినాయకుడిగా రానా బాలకృష్ణ నుంచి పురస్కారం స్వీకరించారు. రానాకి ఎంటర్‌టైనర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం కూడా లభించింది. 'గౌతమీపుత్ర శాతకర్ణి'లో నటనకిగానూ నందమూరి బాలకృష్ణ ఉత్తమ నటుడుగా విమర్శకుల విభాగంలో పురస్కారం అందుకొన్నారు. ప్రముఖ నటులు శరత్‌కుమార్, రాధికలు ఈ పురస్కారాన్ని బాలకృష్ణకి అందజేశారు. ఉత్తమ నటిగా 'నేనే రాజు నేనే మంత్రి'లో కథానాయికగా నటించిన కాజల్‌కి పురస్కారం లభించింది. ఉత్తమ తొలి చిత్ర కథానాయకుడు ఇషాన్ (రోగ్), ఉత్తమ తొలి చిత్ర కథానాయికగా కల్యాణి ప్రియదర్శిని (హలో), ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా సందీప్ వంగా (అర్జున్‌రెడ్డి), ఉత్తమ సహాయ నటుడుగా ఆది పినిశెట్టి (నిన్ను కోరి), ఉత్తమ సహనటిగా భూమిక (ఎమ్.సి.ఎ), ఉత్తమ నేపథ్య గాయనిగా మధుప్రియ (ఫిదా), ఉత్తమ గీత రచయితగా సుద్దాల అశోక్‌తేజ (ఫిదా), ఉత్తమ హాస్యనటుడిగా రాహుల్ రామకృష్ణ (అర్జున్ రెడ్డి)లకి పురస్కారాలు లభించాయి. 'గౌతమీపుత్ర శాతకర్ణి' ఉత్తమ చిత్రంగా విమర్శకుల విభాగంలో పురస్కారాన్ని కైవసం చేసుకొంది. వేడుకలో ప్రగ్యా జైస్వాల్, శ్రియ, ప్రణీత, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. నాయికలు ఆటపాటలు, ర్యాంప్ వాక్‌లతో సందడి చేశారు.



రానా



ఎం.ఎం.కీరవాణి



సెంథిల్ కుమార్



ప్రణీత



శ్రియ, ఆది, సుధీర్‌బాబు

## వస్తున్నాడయ్యో 'సామి'



కీర్తి సురేష్, విక్రమ్

విక్రమ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'సామి'. కీర్తి సురేష్ కథానాయిక. హరి దర్శకత్వం వహించారు. బెల్లం రామకృష్ణారెడ్డి, కావ్య వేణు గోపాల్ నిర్మాతలు. సెప్టెంబరు 21న చిత్రాన్ని ప్రేక్షకుల విడుదల చేస్తారు. నిర్మాతలు మాట్లాడుతూ ' 'పదిహేనేళ్ల తర్వాత విక్రమ్, హరి కలయికలో వస్తున్న చిత్రమిది. ఈ సినిమాలో విక్రమ్ నట విశ్వరూపం చూస్తారు. కీర్తి సురేష్ చేసే హంగామా మంచి వినోదాన్ని పంచుతుంది. హరి తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం ప్రధాన బలం'' అన్నారు.

## గీతోపదేశం

చుట్టుముట్టు ఆపదలను
మట్టుబెట్టబూనుమురా
పిరికితనము కట్టిపెట్టి
ధైర్యము చేపట్టుమురా

గీతం: మత్తు వదలరా...
చిత్రం: శ్రీకృష్ణపాండవీయం
రచన: కొసరాజు రాఘవయ్య చౌదరి
– పంపినవారు: బి.సుబ్బరాజు, తణుకు




నారా రోహిత్

నారా రోహిత్, సుధీర్‌బాబు, శ్రీవిష్ణు, శ్రియ శరణ్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'వీరభోగ వసంత రాయలు'. ఇంద్రసేన.ఆర్ దర్శకత్వం వహిస్తున్నారు. అప్పారావ్ బెల్లానా నిర్మాత. చిత్రీకరణ చివరి దశకు చేరుకొంది. అక్టోబరు 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. "క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న చిత్రమిది. కొత్త మతం పుట్టుకొస్తుంది... అనే ఉపశీర్షికతో వస్తున్న ఈ చిత్ర కథ ఆసక్తిని రేకెత్తిస్తుంది. త్వరలోనే పాటల విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

## బంటితో పాట



పూర్ణ

రవిబాబు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'అదుగో'. సురేష్ ప్రొడక్షన్స్ సమర్పిస్తోంది. బంటి అనే పందిపిల్ల ముఖ్య భూమిక పోషించింది. అభిషేక్ వర్మ, నభా, రవిబాబు, ఉదయ్‌భాస్కర్, ఆర్కే, వీరేందర్ చౌదరి కీలక పాత్రలు పోషించారు. దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఇందులోని ఓ ప్రత్యేకగీతంలో కథానాయిక పూర్ణ ఆడిపాడింది. ఈ పాటని సోమవారం విడుదల చేస్తున్నారు. "ప్రేక్షకులకి కనువిందు చేసే పాటలో పూర్ణ, బంటి ఆడి పాడారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకి మంచి స్పందన లభించింది. చిత్రం కూడా అందరికీ నచ్చుతుంది. తెలుగుతో పాటు, ఇతర భాషల్లోనూ చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

## హాయి హాయిగా...



చరిష్మా శ్రీకర్, అరుణ్ తేజ్

అరుణ్ తేజ్, చరిష్మా శ్రీకర్ జంటగా బి.ఎన్. రెడ్డి అభినయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీతోనే హాయ్ హాయ్'. యలమంచిలి ప్రవీణ్, డా.ఏయస్ కీర్తి, డా.జి.పార్థసారథి రెడ్డి నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో కథానాయకుడు శ్రీకాంత్ టీజర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సినిమా పేరే హాయిగా ఉంది. వైద్య వృత్తిలో కొనసాగుతూ, సినిమా రంగంపై ఇష్టంతో వచ్చారు నిర్మాతలు. అగ్ర దర్శకుడు దాసరి దగ్గర పనిచేసిన అనుభవంతో దర్శకుడు ఈ చిత్రాన్ని తీశాడ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కథని నమ్మి చేసిన ప్రయత్నమిద"న్నారు. "మా ప్రయత్నం ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుందనే నమ్మకం ఉంది. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో బెనర్జీ, యలమంచిలి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## చౌక బేరం

నవీద్, 'కేరింత' నూకరాజు, యామిని భాస్కర్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'భలే మంచి చౌక బేరమ్'. మురళీకృష్ణ ముడిదాని దర్శకత్వం వహిస్తున్నారు. అరోళ్ల సతీష్‌కుమార్ నిర్మాత. అక్టోబరు 5న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రాన్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "మా సంస్థ నుంచి పలు విజయవంతమైన చిత్రాలొచ్చాయి. 'భలే మంచి చౌక బేరమ్' చూడగానే నచ్చింది. ఆసక్తికరంగా, వినోదాత్మకంగా సాగే చిత్రమిది. అందుకే మా సంస్థ నుంచి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకొన్నా. మారుతి అందించిన ఒక విభిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపుదిద్దుకొంది" అన్నారు.



నూకరాజు, యామిని భాస్కర్, నవీద్

## సొంత అల్లుడిలా ఆదరిస్తున్నారు



నాగవంశీ.ఎస్, నాగచైతన్య, అను ఇమ్మాన్యుయేల్, మారుతి

"తెరపై నేను భిన్నంగా కనిపించానని... హావభావాల పరంగా మరింత ఉత్సాహంగా కనిపించాననే ప్రశంసలొచ్చాయి. ఒక నటుడికి ఇదే ఉత్తమమైన ప్రశంస. 'శైలజారెడ్డి అల్లుడు'కి వచ్చిన వసూళ్ల గురించి చెప్పినప్పుడు మొదట నమ్మకలేకపోయా. ఇంత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'శైలజారెడ్డి అల్లుడు'. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. మారుతి దర్శకత్వం వహించారు. నాగవంశీ.ఎస్, పి.డి.వి.ప్రసాద్ నిర్మాతలు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రానికి లభిస్తున్న స్పందనపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ చిత్ర బృందం కృతజ్ఞతాపూర్వక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ "నన్ను కొత్తగా చూపించిన మారుతికి కృతజ్ఞతలు. అప్పుడు 'ప్రేమమ్', ఇప్పుడు 'శైలజారెడ్డి అల్లుడు'... నా సినీ ప్రయాణంలో ఒక మంచి విజయం కావాలనుకొన్నప్పుడంతా నిర్మాతలు మంచి చిత్రాల్ని ఇచ్చార"న్నారు. మారుతి మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకులు మా 'శైలజారెడ్డి అల్లుడు'ని వాళ్ల సొంత అల్లుడిలా ఆదరిస్తున్నారు. నాగచైతన్యతో మరో సినిమా చేయాలనిపిస్తోంద"న్నారు. అను ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ "ఈ విజయానికి కారణం ప్రేక్షకులే. అందరికీ నచ్చే చిత్రమిద"న్నారు. కార్యక్రమంలో నరేష్, పృథ్వీ, నిజార్ షఫి తదితరులు పాల్గొన్నారు.